అమ్మా లేదు. ఎన్నిసార్లు పిలిచిన పలుకదు. నేనుమాత్రం ఏంచెయ్యను ఇంకేదో చెప్పబోతున్న తల్లిని ఉండమ్మా ఇప్పుడే వస్తాను అంటు రమ పడుకున్న గదిలోకి వెళ్లాడు. రమ నిద్రపోతోంది. జుట్టురేగి మాసిన చీర కట్టుకుని వైరాగిగా పడుకుంది. మధు మనస్సంతా రమ పట్ల జాలితో నిండి పోయింది. రమ లే భోంచేద్దువు గాని మృధువుగా తట్టిలేపాడు. నాకాకలిలేదు మీరు భోంచేయండి. అందుకే చెబితే వినవు. నీవు వద్దంటె నేను మానేస్తాను. రా అంటూ చెయ్యిపట్టుకుని తీసుకొచ్చాడు. కొడుకు, కోడల్ని అలా తీసుకొస్తుంటె ముచ్చటగ చూసింది మధు తల్లి. ఆ రాత్రి ఇదరు సంతోషంగ గడిపారు. అపరేషన్ సంగతి రమతో చెప్పాడు. రమ ఆనందానికి అవధులులేదు. కొడుకుద్వారా సంగతంతా విని, నిర్విణ్ణురాలయింది మధు తల్లి. మీ ఇష్టంనాయనా నేను చెప్పేటంతదాననుకాను. అలా అనకమ్మా పరిస్థితులతో రాజీ పడాలిగదా అను నయంగ అన్నాడు మధు. ఈ సారి కానుపులో చేయించుకో వచ్చులే బాబు, మరలా బాబేమొనని నీ ఆశ పాపయితే? ఏవరైతేమాత్రం ఏంచేస్తాం భగవంతుడెవరినిస్తే వాళ్ళని. అలా కుదరదులేమ్మా అంటూ బయటకు వెళ్ళాడు.

వెళ్ళొస్తానత్తయ్యా అంది రమ, ముఖం ప్రక్కకు తిప్పుకున్న అత్తగారిని చూసి. మధుకికూడ ఎంత సరిపెట్టుకుందామన్నా ఇంకో బాబయితే బాగుండుననిపిస్తోంది. మౌనం వహించాడు.

అత్తగారి వంక, మధు వంక మార్చి, మార్చిచూసింది. రమ హృదయం బరువుగా మూల్గింది. వీళ్ళందరిని కాదని తనేం బావుకుంటుంది. తనలో తననుకుంది. నిర్విఘ్నంగ ఆపరేషన్ జరిగిపోయింది.

కాని ఆపరేషన్ అయిన నెలకే విషజ్వరం బాబుని పొట్టపెట్టుకుంటుందనుకుంటె ఆపరేషన్ చేయించుకునేదాన్ని కాదేమో, కరువు రోజులలో పిల్ల లెక్కువయిన కొద్ది సంసారంలో సుఖశాంతులు తగ్గిపోతాయని, ఆర్థికంగ అనేక ఇబ్బందుల నెదుర్కోవలసివస్తుందని ఆలోచించాను, కాని భగవంతుడు ఇంత నిర్దయుడని, ఇంత అన్యాయం చేస్తాడని ఊహించనైనా లేదు. బాబంటె పంచప్రాణాలు అత్తగారు, మధు ఎలా కోలుకుంటారు. తల్లి ఒళ్ళోనుండిలేచి మధు పడుకున్న గదివైపు నడచింది.

* * *

మధు కిటికీ దగ్గర నిలబడి శూన్యము, అనంతము అయిన ఆకాశం వైపు చూస్తున్నాడు. రమను చూసి

(తరువాయి 26వ పేజీలో)

# కొత్తల్లుడు - గొంతెమ్మ కోరిక

రచన: శ్రీమతి పోతూరి కనకదుర్గ

"ఇదుగో, ఏమేవ్,... పెద్దల్లుడు, చిన్నల్లుడు, ఉత్తరాలు రాశారే!"...అన్నారు, అప్పుడే టపా అందుకున్న జగన్నాథంగారు.

ఆదరాబాదరా వంటగదిలోనుండి వచ్చింది అన్నపూర్ణమ్మ.

'ఏమని వ్రాశారు? పండక్కి వస్తున్నారా?' సంబరంగా అడిగింది.

ఆవిడ సంబరం చూచిన జగన్నాథంగార్కి చిర్రెత్తుకొచ్చింది. అయినా సంబాళించుకుని!

'పెద్దల్లుడుకి సెలవులేదుట (బ్రతికించాడు) రానని రాశాడు. రెండవ అల్లుడు మన మాటను మన్నించి ఆ రోజుకయినా (చంపేశాడు) తప్పకుండా వస్తానని రాశేడు.

'ఇహపోతే మన మూడో అమ్మాయి సరళ, అల్లుడు. రాంప్రసాద్, నూతన దంపతులుకదా! వారిని స్వయంగా తీసుకునిరావాలి వాళ్ళు వస్తేనే కదండీ మన యిల్లు కళకళ లాడేది'

'అవునవును, మన యిల్లు కళకళలాడుతుంది, నా వళ్లు ఘెళ ఘెళ మంటుంది.'

'ఛ ..ఛ ..అవేం మాటలండీ!' నొచ్చుకుంది.

'లేకపోతే మరేమిటీ అంట, అల్లుళ్ళు జలగల్లా పీక్కుతింటుంటే మరెలాటంటాను.' అని మరోమాటకు అవకాశ మివ్వకుండా అక్కడనుండి వెళ్ళిపోయారు.

అన్నపూర్ణమ్మ ఉస్సురంటూ లోనికి పోయింది.

పాపం ఆయన అన్నమాటా నిజమేమరి; పదిమంది సంతానం (కుటుంబనియంత్రణ సంఘాన్ని ఉద్ధరించలేదు కాబోలు) అందులో ఎనమండుగురు ఆడ పిల్లలు, ఇద్దరు మగ పిల్లలు, ఆయన సంపాదనచాలదు. స్టేటు గవర్నమెంటులో యు.డి.సి, ఉద్యోగం. ఇంక ఆయన సర్వీసు కూడా ఎక్కువకాలం లేదు. అదే చింత ఆయనలో ఎక్కువయింది. పిల్లల భవిష్యత్తుని గురించి ఆలోచనలు తప్పని సరిగా వెంటాడుతూనే ఉంటాయి.

మధ్య మధ్యలో కూతుళ్ళ పురుళ్లు; అల్లుళ్ళ అలకలు; తప్పనిసరిగా తీర్చబడినవి. అందులో ముఖ్యంగా పండగ బహుమతులు, ఈ కొత్తల్లుడుగారి కోర్కె ఎలాంటిదో!

'అమ్మా,...అమ్మా...సరళక్క బావగారు, వచ్చారే," గిరి ఆనందానికి అంతులేదు.

అన్నపూర్ణమ్మ, కూతురికీ అల్లుడికీ కాళ్ళకి నీళ్ళిచ్చి; ...అల్లుణ్ణి పలకరించి కూతుర్ని లోపలికి తీసుకొనివచ్చి కుశల ప్రశ్నలు వేసింది. అన్నిటికీ ముభావంగా సమాధానం చెప్పింది తప్ప సరళ సంతోషంగా లేదు.

కారణం ఎంత ఊహించినా అన్నపూర్ణమ్మకు అంతు బట్టలేదు.

ఆ మరునాడే ఉగాది పండగ. గుమ్మాలు పచ్చని తోరణాలతో అందంగా అలంకరించబడ్డాయి. ఇల్లంతా రంగవల్లులు తీర్చిదిద్దింది అన్నపూర్ణమ్మ.

సాయంత్రానికి బండి దిగారు. చిన్నల్లుడు, మాధవ రావు, కూతురు, జానకి వాళ్ళ పిల్లలు, రాధ, రవి, ఇంక ఇంట్లో సందడికి తక్కువేమిటి?

మనుమల్ని ముద్దాడి అన్నపూర్ణమ్మ మురిసిపోయింది.

బావగార్లతో హాస్యాలాడుతూ హరి, గిరి, చాలా ఉత్సాహంగా తమ విద్యార్థి బృందం నేటి ఆంధ్రోద్యమాన్ని ఎలా కొనసాగిస్తున్నదీ,...ఫుల్‌స్టాప్, కామా లేకుండా చెప్పేస్తున్నారు.

అంతకన్నా ఉత్సాహంగా రాంప్రసాద్ (కొత్తల్లుడు) పిల్లల్లో కలిసిపోయి తమ లెక్చరర్ల బృందం సమ్మె, రిలే నిరాహారదీక్షలు, ఎలా పాటిస్తున్నదీ వివరించాడు.

ఆ రాత్రి బావమరదుల హాస్యాలతో భోజనాలు ముగించారు.

అందరూ ఎదురుచూస్తున్న ఉగాది రానే వచ్చింది. తెల్లవారుజామున అందరి తలంట్లు అయ్యాయి.

ఇంక కొత్తల్లుడిగారి తలంటుమాత్రం మిగిలిపోయింది.

అన్నపూర్ణమ్మ వెళ్ళి పిలుచుకునివద్దామని అనుకుంటూ ఉండగానే రాంప్రసాదే అక్కడకు వచ్చాడు 'నాకు కుంకుడుకాయలు వద్దండీ అత్తగారూ: నేను సాంపూ వాడతాను నాకోసం మీరు శ్రమపడవద్దు.' అని మరో మాటకు అవకాశం లేకుండా బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

అన్నపూర్ణమ్మగారు మాత్రం రాంప్రసాద్ 'అత్తగారూ' అని ఆప్యాయంగా అన్నందుకు మురిసిపోయింది, (పెద్దల్లుడు, చిన్నల్లుడు, ఆవిడని ఎప్పుడూ అత్తగారూ అని పిలవలేదు).

తలంట్ల తతంగమంతా పూర్తయింది.

చేదు, పులుపు, తీపి, వగరు, తినాలంటూ ఉగాది పచ్చడి తెచ్చి అందరికీ పెట్టింది అన్నపూర్ణమ్మ.

ఇంతవరకూ ఎటువంటి కలతలు, కలహాలు, లేకుండా మా జీవితాలు వెళ్ళిపోతున్నాయి, ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరంకూడా సుఖ సంతోషాలు ప్రసాదించమని భగవంతుడిని ప్రార్థించింది.

టిఫెన్, కాఫీలు, సెక్షన్ ముగిసింది. బావగార్లు, బావమరదులు, అలాఊళ్ళో కాసేపు తిరిగి వస్తామని వెళ్ళిపోయారు.

అన్నపూర్ణమ్మ వంటలు, పిండి వంటలు, చేయడంలో లీనమయింది. జానకి, సరళ, ఆమెకు సహాయం చేస్తున్నారు. అంతకంతకు సరళకు దిగులు ఎక్కువయింది తలనొప్పి అని వెళ్లి పడుకుంది.

జానకి మాత్రం చెల్లెల్ని ఒక కంట కనిపెడుతూనే వుంది.

'అదేమిటే, అలా ఉన్నావ్ సరళ?' అడిగింది.

'ఏంలేదక్కా బాగానే వున్నాను' తప్పించుకుంది.

ఊళ్ళోకెళ్ళిన పండగ పెద్దలంతా దాదాపు 1 గం॥ టైములో ఇంట్లో అడుగుపెట్టారు. పట్టు పంచ కట్టి, మీద ఉత్తరీయము వేసుకుని, విభూతి రేఖలు ముఖాన కుంకుమ బొట్టు పెట్టుకుని, పూజ ముగించుకుని వారికోసమే ఎదురుచూస్తున్నారు జగన్నాధంగారు.

'ఆ...అందరూ వచ్చారు, వడ్డన ప్రారంభం చెయ్యి' భార్యను పురమాయించి ముందు హాల్లోకి వచ్చారు.

అంతదాకా ఛలాకీగా హుషారుగా మాట్లాడిన రాంప్రసాద్ గదిలో మంచమెక్కి పడుకున్నాడు. ఎవరు పిలిచినా ఉలకడు, పలకడు.

'నేను వెళ్ళి ఆయన్ని తీసుకొనివస్తాను. మీరు భోజనానికి కూర్చోండి నాన్నా' అంది సరళ. ఆమె ముఖం అంతా కళావిహీనమయింది.

'ఏమండి...భోజనానికి రండి. మీకోసం మా నాన్న, బావగారు వాళ్లు ఎదురు చూస్తున్నారు.' అంది భర్త ముఖాన్ని తన వైపు తిప్పుకుంటూ . అప్యాయంగా.

'ఇప్పుడు నీ నటనా చాతుర్యంతో నేను కరిగిపోవడం లేదు.' అన్నాడు ఆమెను ఒక్క తోపుతోసి. ఇటువంటిదేదో జరుగుతుందని ఊహించిన సరళ కిక్కురుమనలేదు, దెబ్బ తగిలినచోటు రాసుకుంది. ఎప్పటినుంచో దిగమింగిన దుఃఖం ఒక్కసారి పెల్లుబికింది.

'ఏం అలా మొద్దులా నిలబడ్డావ్? నేను చెప్పిన మాట సంగతి ఏమైంది? మీ నాన్నను అడిగావా? ఏమన్నాడు? అడేదో తేలేగాని నేను భోంచెయ్యను. నువ్వు చెయ్యడానికి వీల్లేదు,' ఛీత్కారం చేసాడు.

'ఏమాట ఆ 'స్కూటర్' సంగతేగా! తరువాత నెమ్మదిగా చెప్తాను. ముందు మీరు భోజనానికి రండి బావుండదు. మా నాన్న ఆరోగ్యం అసలే బావుండలేదు.'

సరళ ప్రాధేయపడింది.

రాంప్రసాద్ మనసు ఏమాత్రం కరగలేదు. సరళ బ్రతిమాలిన కొద్దీ అతని కోపం తీరస్థాయి నందుకుంటోంది. అవతల అంతా వడ్డన అయి 'కొత్తల్లుడి' కొరకు ఎదురుచూస్తున్నారు. ఎంతకీ అల్లుడి జాడ లేక పోయేసరికి జగన్నాథంగారు గది వద్దకు వచ్చారు.

ఆయన గది వద్దకు వచ్చారో లేదో లోపల ధన్ మని చప్పుడవడం, వెంటనే తలుపు తెరుచుకుని రాంప్రసాద్ సూట్‌కేసుతో, ప్రత్యక్షమవడం, జరిగాయి.

ఈ హఠాత్ సంఘటనకు జగన్నాథంగారు విస్తుపోయారు. పరిస్థితి ఆయనకర్థంకాలేదు.

'ఏమిటి నాయనా ప్రసాద్, అమ్మాయి ఏమైనా అందా? నీ ప్రయాణం ఎక్కడికి? వివరంగా చెప్పు నాయనా' అన్నారు ఆయన కంఠం రుద్ధమయింది.

'మీ అమ్మాయినే అడగండి. నా మాటంటే ఎంత నిర్లక్ష్యమో!' విసురుగా తల ఎగరేసి హాల్లో అడుగు పెట్టాడు.

అన్నపూర్ణమ్మ కూతురిని ఎంతగానో బ్రతిమాలిన మీదట చెప్పింది.

ఆయనకు 'పండగల బహుమతి' 'స్కూటర్' కావాలిటమ్మా. అసలే నాన్న ఆరోగ్య బావుండలేదు. అప్పు చేసి నాన్న ఈయనకి స్కూటర్ కొంటే మిగతా వాళ్లు అలాంటి వాళ్ళేగా! నేను ఒకదాన్నే మీ కూతుర్ని కాదుగా! తన అల్లుళ్ళందరి కోర్కెలు నాన్న తీర్చడం చాల కష్టమైన పని. ఇవన్నీ ఆలోచించి నేను వచ్చిన దగ్గర నుంచీ ఈ విషయం చెప్పలేక నాలో నేనే బాధ పడ్డానమ్మా' అని తల్లిని కావలించుకుని తనివితీరా ఏడ్చింది.

ఆ మాతృ హృదయం తల్లడిల్లి పోయింది. ఈ సంగతి విన్న జగన్నాథం గారు మ్రాన్పడి పోయారు.

జానకికి ఇప్పటికి తెలిసింది. చెల్లెలి విచారానికి కారణం. బోలెడు జాలి కలిగింది.

జగన్నాథంగారు అల్లుణ్ణి ప్రాధేయపడ్డారు.

'బాబూ ప్రసాద్, ముందు భోంచెయ్యి నాయనా, ఆ విషయం తరువాత ఆలోచిద్దాం. నా శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తాను' అన్నారు విచార వదనులై.

'లాభం లేదు, ఖచ్చితంగా ఇస్తాను, అంటేనే నేను మీ యింట్లో భోంచేసేది. లేకపోతే పచ్చి మంచినీళ్లు కూడా ముట్టుకోను' అల్లుడి భీష్మ ప్రతిజ్ఞ.

జగన్నాథంగార్కి అల్లుడి మూర్ఖపు పట్టుదల అర్థం కాలేదు. ఇప్పటికిప్పుడు స్కూటర్ కొనటం మాటలా! ఆయన బుర్ర పనిచెయ్యడం మానేసింది.

గిరి, హరి, ఇదికలా? నిజమా? అన్నట్లు చూస్తున్నారు. ఉదయంనుంచీ తమతో అంత ఉత్సాహంగా మాట్లాడిన బావగారేనా? వారికి అత్యాశ్చర్యాన్ని కలిగించింది. 'మేడి పండు చూడ మేలిమైయుండు. పొట్ట విచ్చిచూడ పురుగులుండు.' అన్న వేమన్నగారి పద్యం జ్ఞాపకానికి వచ్చింది. ఎర్రగా బుర్రగా పర్సనాలిటీ ఉంటే సరిపోయిందా! సంస్కారం లోపించిన తర్వాత స్వగతంగా అనుకున్నారు.

చిన్నల్లుడు మాధవరావు 'స్కూటర్! మామగారు నిజంగా కొంటారేమో కొత్తల్లుడికి, తనకి అలాంటి బహుమతులు ఏమి ఇవ్వలేదు. ఏదో బట్టలుకొని పెట్టుట తప్ప, ఆతృతని బయటికి కన్పడనీయక ఆయన సమాధానంకొరకు చెవులు రిక్కించి కూర్చున్నాడు.

మిగతా పిల్లలు (రాంప్రసాద్ మరదళ్ళు వగైరా) స్టేజిమీద నాటకం చూస్తున్నంత సంబరంగా చూస్తున్నారు. వాళ్ళకి ఆంధ్రోద్యమంకూడా ఇంత రసవంతంగా లేదేమో మరి; అందరూ ఆకలి మాటే మర్చిపోయారు.

'సరళా నేను ఇంటికి వెళ్తున్నాను. భర్తంటే ఏమాత్రమయినా గౌరవముంటే వెంటనే బయల్దేరు. లేకపోతే ఇక్కడే ఉండు శాశ్వతంగా. మన యిద్దరికీ ఎట్టి సంబంధమూ లేదు. ఏమి నిర్ణయించుకుంటావో అది నీ యిష్టం ...పది నిముషాలు టైము ఇస్తున్నాను.' అన్నాడు హీరోలాఫోజు పెట్టి, డయిలాగ్ వల్లించాడు నాటక ఫక్కీలో.

భర్త ఇచ్చిన పదినిముషాలు గడిచిపోయాయి: సరళ, తల్లికి, తండ్రికి, పాదాభివందనం చేసి, భర్తననుసరించింది, భారతరత్నంకదా మరి; కష్టమయినా సుఖమైనా భర్తే దైవమని భావిస్తుందికదా!

అన్నపూర్ణ, జగన్నాథంగార్ల దుఃఖం వర్ణనాతీతం. అల్లుడి కోర్కె తీరుద్దామన్నా అంత తాహతులేని మధ్య తరగతి కుటుంబీకుడు. 'నేటి ఆంధ్రోద్యమధర్మమా అని అల్లున్ని నిరాహారదీక్షలు ఇందుకు పనికివస్తున్నాయన్నమాట,' అనుకున్నారు చివరికి.

ఉగాది పండుగ ఇల్లంతా కళావిహీనమయింది.

# నిరభిమానులు కోరేది కులాభిమానం

పెళ్ళి బాజీ లాగిపోయాయి. అతిథుల చెవుల గింగుర్లు తగ్గిపోయాయి చిన్నగా కలకలం బయలు దేరింది. పీటల మీద కూర్చున్న కాబోయే దంపతులు పిడుగుపడ్డట్టుగా చూస్తున్నారు, ఈటెల్లాంటి మాటలు వదులుతున్నాడు పెళ్ళికొడుకు తండ్రి ఈశ్వరయ్య. ఈశ్వరయ్యకు ఈశ్వరుడన్నా లెక్కలేదు, ఐశ్వర్యం ప్రధానం. ఈ సంగతి తెలియని పెళ్ళి పిల్ల తండ్రి సినిమా నాగయ్యలా 'ఇయ్యాల్సిన డబ్బు సమయాని కందలేదు మీరు' అని ప్రాధేయపడుతున్నాడు. నేనప్పుడే అనుకున్నాను నీ పుల్లటి మొగం చూసి ఇలాంటి దేదో అడ్డు వేస్తావని. అయినా కట్నం విషయంలో నేను యెంత ఖచ్చితంగా ఉంటానోనన్న సంగతి నేను చేసిన నా మొదటి ఇద్దరి కొడుకుల పెళ్ళిళ్ళలో నిరూపించాను. నీ చెవిలో పడిందో లేదోనని ఒకటికి నాలుగు సార్లు ఆ పెళ్ళిళ్ళ పేరయ్యతోకూడా చెప్పించానే ఆ మాత్రం బుర్ర కెక్కించుకోలేని మంద బుద్ధివి, 'నీ కూతురు నాకక్కర్లేదు వెళ్ళు' అంటూ ఈశ్వరయ్య ఉగ్రేశ్వరుడై కొడుకు వైపు సైగ చేస్తూ మరీ కదిలినాడు.

'బావగారూ! చచ్చి నీ కడుపున పుడతాగాని కార్యం ఒడ్డెక్కించండి మీ ఋణంలో యెన్నటికీ పోను పైకం అందుతే రేపే ముట్టజెబుతాను' అని ఆ పిల్ల తండ్రి పరిపరివిధాలా ప్రార్థించాడు. ఈశ్వరయ్య గుండె ఇనుప ముక్క అన్న సంగతి తెలియక.

'అయ్యా నీ వేషమే వద్దంటుంటే, నేను కొత్త చీర కట్టుకొస్తానన్నట్టు, నీతో సంబంధమే వద్దంటుంటే చచ్చి నా...కడుపున పుడతానంటా వేమిటి?' అని ఓ నాగభూషణం డైలాగు వదిలి ఇంకా పీటల మీది నుండి కదలడం లేని కొడుకును కళ్ళెర్ర జేసి చూచాడు.

పెళ్ళి కొడుకు గుండెల్లో తండ్రంటే గూడు కట్టుకున్న భయం వెల్లువలా పొంగిరావడంతో లేవాలనుకున్నాడు. పసుపురాసుకున్న బుగ్గల పై నుండి కన్నీరు కారుస్తున్న వధువును చూస్తుంటే అలాగే కూర్చుండాలనుకున్నాడు. ఏదో ఒక నిర్ణయానికి రావాలనుకునే సరికి రెంటిమధ్య సంఘర్షణ మొదలైంది. అందులో మొదటిదే పై చేయి చేసుకుంది. బరువుగా లేచి బంధం విడిపించుకుని బాధగా నడిచాడు. ఒక్క మాటకూడా తండ్రి నెదిరించే ధైర్యం లేని పెళ్ళి కొడుకును అక్కడ ఎవరూ ఆపలేక పోయారు. కొంతముందుకు నడిచాక గుంపులో నుండి నలుగురు పెద్ద మనుషులు సాహసించి ఈశ్వరయ్యను వేడుకున్నారు. ఆయన లొంగే బాపతు కాదని తెలిసిన కొందరు పెళ్ళి కొడుకును వెనక్కు లాగుతున్నారు. అ పితృ విధేయుడు 'మీరు నాన్నతోనే మాట్లాడుకోండి నేనేం చేయగలవాన్ని' అంటున్నాడు. ఆ మాటలకు వరుని తరపునే పెళ్ళికి వచ్చిన ప్రకాశం భగ్గున మండి పోయాడు. తమాయించుకుని స్నేహితున్ని సమీపించి 'ఒరేయ్ ఇది న్యాయం కాదురా!' అన్నాడు బతిమాలుతున్నట్టు.

---

పాతల్లుడి ముఖం పాత చింతకాయ పచ్చడిలాగుంది. కొత్తల్లుడికి ఏమైనా కొనిస్తారేమో, తనకీ ఏదైనా ఛాన్సు తగులుతుందేమో అనుకున్నాడు. 'కథ' అడ్డం తిరిగింది. 'డామిట్' ఆకలి. అత్తగారు చేసిన పిండి వంటలు జ్ఞాపకం వచ్చాయి.

సాధారణంగా అల్లుళ్ళు మామగారి తాహతును గుర్తించరేమో? (అందరూ అలా ఉంటారని నేననడం లేదండోయ్) ఏదైనా తమదాకా రావాలి కదా మరి. తాహతునిమించి గొంతెమ్మ కోర్కెలు పనికిరావు.